

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## కలర్స్

**"ఆపు. ఏయ్ ఒక నిమిషం బండాపు" ఫల్గుణ** భుజం మీద చేత్తో తడుతూ అరిచింది మహిమ.

బైక్‌ని రోడ్డుపక్కగా ఆపుతూ కంగారుగా అడిగాడు ఫల్గుణ.

"ఏమైంది?"

చెంగున బైక్ మీంచి దూకి రెండడుగులు వెనక్కి వేసి ఓ ఇంటి కాంపౌండ్ వాల్ మీంచి బయటకి వచ్చిన పూలకొమ్మలని చూసి ఎగిరి ఆ పూలని అందుకుంటూ తన వంకే విభ్రాంతిగా చూస్తూన్న ఫల్గుణని చూసి అడిగింది.

"ఎంత బావున్నాయో కదా ఫణీ, కొమ్మ బతుకుతుందంటావా? లేకపోతే అంటుకట్టాలా? ఈ ఇంటివాళ్ళని అడిగి పక్కన చిన్న మొక్కలున్నాయేమో వేళ్ళతో తీసుకెళ్దామా?"

పకపక నవ్వాడు ఫల్గుణ.

"నీకు మొక్కల పిచ్చి మరీ ఎక్కువవుతోంది సుమప్రియా. ఇంట్లోకి వెళితే దొంగలనుకునే ప్రమాదం ఉంది పద."

ఎవరైనా కనిపిస్తారేమో అడుగుదామని గేటులోంచి ఆశగా లోపలికి చూసి నిరాశగా వెనుతిరిగింది మహిమ.

జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించి ఆమె మొహం మీదకి రింగులు వదులుతూ నవ్వాడు ఫల్గుణ.

"బడాయ్. రజనీకాంత్‌లా రింగులు వదులుతున్నావే?" పొగని చేత్తో బెదరకొడుతూ తనూ నవ్వింది మహిమ.

***

బెల్ మోగిన శబ్దం విని తలుపు తెరిచిన మహిమ ఎదురుగా చిన్న అపూలకుండీతో నిలబడి ఉన్న కొరియర్ బాయ్‌ని, కుండీలో అరవిరిసిన ఎర్రగులాబీని సంభ్రమంగా అడిగింది.

"యస్?"

"మహిమ మీరేనా? మీకీ గులాబీ ముక్క కొరియర్ వచ్చిందండి" అతను చెప్పాడు.

హేపీ బర్త్‌డే టు యూ.

ఆనందంగా ఆ ఉత్తరాన్ని ముద్దుపెట్టుకుంది మహిమ.

ఫల్గుణకి ఫోన్ చేసి చెప్పింది.

"ఫణీ ఎంత బావుందో చిట్టి గులాబీమొక్క. ఎంత మంచి గిఫ్ట్ ఇచ్చావో తెలుసా?"

"మరి? మహి అంటేనే భూమి. ఓ పెద్ద మర్రివృక్షం బహుమతి ఇద్దామనుకున్నా కానీ ఇండియాలో ఇంకా ఆ టెక్నాలజీ రాలేదట. సాయంత్రం రెడీగా ఉండు. సిక్స్ కల్లా వస్తాను" ఫల్గుణే చెప్పాడు.

"ఎక్కడికి వెళ్తున్నాం?"

"సస్పెన్స్."

"సరే. ఫైవ్ థర్టీకల్లా రెడీగా ఉంటా.బై" ఫోన్ పెట్టేసింది మహిమ.

ఏడుగంటలకి మహిమ ఇంటి తలుపు తట్టిన ఫల్గుణ తలుపు తీసిన ఆమెని చూసి చిన్నగా ఈలవేసాడు.

"అన్నీ రౌడీ బుద్దులు" ముద్దుగా విసుక్కుంది మహిమ.

తల్లికి చెప్పి చెప్పులు వేసుకుని ఫల్గుణ బైక్ వెనక కూర్చుని అడిగింది.

"ఎందుకు ఈలవేసావు?"

"తెల్లచీరలో ఎంత సెక్సీగా ఉన్నావో తెలుసా? శ్వేతగులాబీలా"

"మనం ఎక్కడికి వెళ్తున్నాం ఫణీ?" ఆ పొగడ్తకి మనసులో ఆనందిస్తూ అడిగింది మహిమ.

"సస్పెన్స్"

"ఆ పేరుతో హోటల్ ఉందా? లేక సినిమానా? " అమాయకంగా అడిగింది.

"నువ్వే చూస్తావుగా?"

బైక్ ఎయిర్ పోర్ట్ బాట పట్టడంతో కంగారుగా అడిగింది మహిమ.

"కొంపదీసి ఫ్లయిట్‌లో ఏ మద్రాసో తీసుకెళ్తున్నావా? మా అమ్మకి చెప్పలేదు"

జవాబు చెప్పకుండా బైక్‌ని నోవాటెల్ హోటల్ ముందు ఆపాడు ఫల్గుణ.

"ఇక్కడ ఫుడ్ ఫెస్టివల్ జరుగుతోందని పేపర్లో చదివాను. దాదాపు సిటీలోని రెస్టారెంట్స్ అన్నీ తిరిగాం. నీ పుట్టినరోజున ఇక్కడికివస్తే నీకు సర్‌ప్రైజ్‌గా ఉంటుందని" గర్వంగా చెప్పాడు.

ఇష్టంగా అతని చేతిని పట్టుకుని లోపలికి నడిచిన మహిమ మెనూకార్డ్‌ని చూసి అదిరిపోయింది.

"ఈ రేట్లేంటి ఫణీ. మనం ఎప్పుడూ వెళ్ళే రెస్టారెంట్‌కి వెళితే సరిపోయేదిగా?"

"ఇవాళ నీ బర్త్‌డే స్పెషల్‌గా ఉండద్దా? మరేం ఫర్వాలేదు. ఏం కావాలో చెప్పు" విస్సుగా అడిగాడు ఫల్గుణ.

"ఏమో నాకు తెలియడంలేదు. నువ్వే చెప్పు."

అతను ఆర్డర్ చేసినవి బుద్ధిగా తింటున్న మహిమని చూసి ఫల్గుణ మురిపెంగా చెప్పాడు.

"ఈ అలంకరణలో ఎంత ముద్దుగా ఉన్నావో తెలుసా? మనపెళ్ళికి ఇంకా మూడునెలలు ఆగాలంటే చాలా కష్టం మహీ."

"ఐదున్నరకల్లా రెడీ అయ్యాను తెలుసా? అంత లేట్‌గా వచ్చావే"

"ఆఫీస్‌లో పని ఎక్కువగా ఉంది. నీకు తెలుసుకదా నేను వర్క్‌హాలిక్‌ని అదీకాక ఈరోజు నీ ఫ్రెండ్ బర్త్‌డే కూడా. వాడికి విష్ చేసి, ఓ డ్రింక్ తాగి వస్తున్నాను" నిజాయితీగా చెప్పాడు ఫల్గుణ.

"నీకు ఫ్రెండ్స్ అంటే చాలా ఇష్టంకదా?"

"అవును. రోజులో సగం ఆఫీస్‌లో ఉంటాం. తోటివాళ్ళతో స్నేహంగా లేకపోతే ఎలా? నాతో కలిసి ఫిఫ్త్ క్లాస్ చదివిన వాళ్ళతో కూడా ఈనాటికీ టచ్‌లో ఉన్నాను తెలుసా? నీ తర్వాత నాకు ఇష్టమైన జాబ్, ఫ్రెండ్స్" సిగరెట్ వెలిగిస్తూ చెప్పాడు ఫల్గుణ.

బద్ధకంగా కళ్ళు తిప్పి ఎదురుగా గోడకి ఉన్న గులాబీల పోస్టర్‌ని చూసి నెమ్మదిగా లేచి కూర్చున్నాడు ఫల్గుణ.

అతని కళ్ళు అకస్మాత్తుగా పెద్దవయ్యాయి. దుప్పటిమీద సన్నటి నల్లటి దారం కదులుతోంది. ఓసారి కళ్ళు తుడుచుకుని చూసాడు. నల్లటి చిన్నపురుగులు పక్కమీద పాకుతున్నాయి.

"మహీ" ఓ గావుకేక వేసాడు.

వంటగదిలో బిజీగా ఉన్న మహిమ కంగారుగా వచ్చి అడిగింది.

"ఏమైంది? "

"ఇదేంటి?" కోపంగా ఆ పురుగుల్ని చూపించి అడిగాడు. మహిమ వంగి వాటిని చూసి ఓ నిమిషం ఆలోచించి చెప్పింది.

"ఆ కిటికీ దగ్గర పెట్టిన ఎర్ర ఆకుల మొక్క ఉంది చూడు. నువ్వు బావుందంటావు? ఆ మొక్కకి ఈ పురుగులు పట్టాయి. పెస్టిసైడ్స్ వేద్దామంటే చిన్న మొక్కకదా తట్టుకోలేదేమో అని మానేసాను. అవి ఎక్కువైనట్లున్నాయి."

ఆమెని ఉరిమి చూస్తూ బాత్‌రూంలోకి నడిచాడు ఫల్గుణ.

పేపర్ చదువుతూ సిగరెట్ తాగుతున్న ఫల్గుణని చూసి కాఫీ కప్పుతో వచ్చిన మహిమ అరిచింది.

"నిద్రలేవగానే ఆ పాడు సిగరెట్ ఏమిటి? ఆ బూడిదని మనీప్లాంట్‌లో విదిలిస్తావే? మన మనీ బూడిదవుతుంది తెలుసా?"

"ఇల్లంతా అడవి చేసావ్. ఎటు అడుగు వేసినా ఏదో కుండీ కాలికి తగిలి వేళ్ళు విరిగిపోతున్నాయ్. పెళ్ళికి ముందు రజనీకాంత్‌లా సిగరెట్ తాగుతావు అనేదానివా?" చిరాగ్గా అడిగాడు ఫల్గుణ.

"ఐతే మాత్రం? దానికి వేళాపాళా లేదా? రోజుకి ఒకటో రెండో సిగరెట్లు తాగాలి కానీ, పెట్టెలు కాదు. నువ్వూ పెళ్ళికి ముందు నన్ను సుమప్రియ అనేవాడివిగా?" ఉక్రోషంగా అడిగింది మహిమ.

"దానికి మాత్రం కంట్రోల్ వద్దా? ఇల్లంతా అడవి చేస్తే ఆ పురుగులూ దోమలు నరకం తెలుసా?"

"నా బర్త్‌డేకి గులాబీ మొక్కని గిఫ్ట్‌గా పంపావుగామరి?"

"ఒకటి. నువ్వు? వేలమొక్కల్ని తెచ్చి నా ఇంట్లోనే నెత్తిన పెట్టావ్."

"నీ ఇల్లా? మన ఇల్లు కాదా?"

"తప్పు తప్పు. మన ఇల్లుకాదు. నీ ఇల్లు. నీ వనం. నా ఇల్లుకాదు. నాకు సిగరెట్ తాగే స్వేచ్ఛకూడా లేని ఇల్లు నా ఇల్లెలా అవుతుంది?"

కోపంగా లేచి రెండడుగులు వేసి 'అమ్మా' అని అరుస్తూ జర్రున జారి గోడకి గుద్దుకున్నాడు ఫల్గుణ. గోడకి ఆనించి ఉన్న రెండు కుండీలు ఆ తాకిడికి పడిపోయి మట్టి, నీరు కలిసిన బురద హాల్లోకి వ్యాపించింది.

"సారీ. పొద్దున్నే మొక్కలకి నీళ్ళు పోసాను. కిందకి కారినట్లున్నాయ్" భయంగా చెప్పింది మహిమ.

"హు," అని హుంకరించి నడుం పట్టుకున్నాడు ఫల్గుణ.

"లేటైందే?" తలుపు తీస్తూ అడిగింది మహిమ.

"ఆఫీస్‌లో పని ఎక్కువగా ఉంది" అలసటగా చెప్పాడు.

"నువ్వొక్కడివే పనిచేస్తావా ఆఫీస్‌లో? అంతా కనీసం ఏడుగంటలకైనా ఇళ్ళకి చేరతారు. నువ్వు మాత్రం తొమ్మిదిదాటందే రావు. మరీ ంత డెడికేషన్‌తో చేసినా వాళ్ళకొచ్చేంత జీతమేగా వచ్చేది? నిష్టూరంగా చెప్పింది.

"నేను డబ్బు కోసం చేయడంలేదు. నీకు ముందే చెప్పానా నేను వర్క్‌హాలిక్‌ని అని. అప్పుడు నచ్చినపని ఇప్పుడెందుకు నచ్చులేదు? అక్కడపనితో అలసిపోయి వస్తే ఇక్కడ సాధింపు ఛీ."

మహిమ కన్నీరు పెట్టుకుని బాల్కనీలో మొక్కలతో తనబాధ పంచుకోడానికి వెళ్ళిపోయింది.

అర్ధరాత్రయింది నెమ్మదిగా నడుం మీద చేతులు పెట్టి పక్కకి తిరిగిన ఫల్గుణ ఓ పక్కగా ముడుచుకుని పడుకున్న మహిమ చెవిలో మృదువుగా చెప్పాడు.

"హేపీ బర్త్‌డే మహీ"

మత్తుగా కళ్ళు విప్పిన మహిమ భర్తని అల్లుకుపోయింది.

ఆ రోజంతా మహిమ కొరియర్ బాయ్ కోసం ఎదురుచూస్తూనే ఉంది. ఫల్గుణ ఈసారి పూల మొక్క పంపడని ఖచ్చితంగా తెలుసుకానీ, ఏదో ఒక బహుమతి పంపకపోతాడా అని ఆశతో ఉంది. కానీ రాలేదు.

సర్‌ప్రయిజ్‌గా త్వరగా వచ్చి ఎక్కడికైనా తీసుకెళ్తాడేమో అని ఏడుగంటలకల్లా శ్రద్ధగా తయారైంది. ఉండబట్టలేక తొమ్మిదికి ఫోన్ చేసింది.

"ఎక్కడున్నావ్ ఫణీ. ఇవాళైనా త్వరగా వస్తావనుకున్నాను."

"ఓ ఫ్రెండ్ బర్త్‌డే పార్టీలో ఉన్నాను. ఓ గంటలో ఇంట్లో ఉంటా."

"ఇవాళ బర్త్‌డే కూడా ఫణీ." నిస్సహాయంగా చెప్పింది.

"నీకు రాత్రి పన్నెండుకే విషెస్ చెప్పాగా?" ఫోన్ పెట్టేసాడు.

పదకొండుగంటలకి తలుపు తీసిన మహిమని ఎగాదిగా చూసాడు ఫల్గుణ.

"ఏమిటీ వేషం?.." అప్రయత్నంగా ఓ బూతుమాట దొర్లింది అతని నోటినుంచి.

నిర్ఘాంతపోయింది మహిమ.

అచ్చం క్రితం పుట్టిన రోజులనే తయారైంది తను. అప్పుడు నచ్చింది ఇప్పుడు?

"నేనింక అతనితో కాపురం చేయిలేనమ్మా ఎప్పుడూ పనీ పనీ. లేదంటే ఫ్రెండ్స్. ఇంటిదగ్గర వంటరిగా ఉంటానన్న ఆలోచనే లేదు. అర్ధరాత్రి అపరాత్రి ఇంటికి రావడం పొద్దున్నే లేచి వెళ్ళడం ఇంట్లో ఉన్నప్పుడు ఒకటే సిగిరెట్లు. మధ్యలో ఆఫీస్‌కి ఫోన్ చేసినా ఊరుకోడు. పనిపాడవుతుందంటాడు. ఎంగేజ్‌మెంట్‌కి పెళ్ళికి మధ్య ఉన్న ఆర్నెల్ల కాలం ఎంత ఎంజాయ్ చేసాం? పెళ్ళవగానే బోర్ కొట్టాను..."

తల్లి ఒడిలో పడుకుని వెక్కుతూ చెప్పింది మహిమ.

"నాకీ మహిమ ఓ తలనొప్పిగా మారిందమ్మా. చైల్డిష్ మెంటాలిటీ. ఎప్పుడూ గారాబం చేయమంటుంది. ఇల్లంతా మొక్కలతో అడవి చేసింది. పురుగులు, దోమలు మట్టి, బురద. ఛ. పగలంతా పని చేసి ఇంటికి వెళితే పసరువాసన ఇల్లు, కోపిష్టి మొహంతో పెళ్ళాం. జీవితమంటేనే విసుగొచ్చేసింది. మొన్న మొక్కలకి పోసిన నీళ్ళమూలంగా జారిపడి నడుం విరిగినంతపనైంది. దానికేం బాధపడకుండా రెండు కుండీలు విరిగిపోయాయని బాధపడింది. పెళ్ళయిందన్న సంగతి మర్చిపోయి, వికారంగా తయారవుతుంది. ఆ అలంకరణ చూసిన ఎవరూ తను పద్ధతిగల ఇల్లాలనుకోరు. ఇలాంటమ్మాయని తెలిస్తే ఎంగేజ్‌మెంట్ఐనా పెళ్ళి కాన్సిల్ చేసేవాడ్ని. ఇప్పుడేం చేయాలో తోచడంలేదు" తల్లితో విసుగ్గా చెప్పాడు ఫల్గుణ.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments on this story